సాక్షి మహబూబ్‌నగర్

గురువారం, 5, అక్టోబర్, 2023



విద్యార్థులకు అల్పాహారం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రేపటి నుంచి అల్పాహారం ఇవ్వనున్నారు.

వివరాలు IIలో ▸



మళ్లీ పెరిగిన ఉల్లి ధర

దేవరకద్ర మార్కెట్‌లో నిర్వహించిన వేలంలో ఉల్లి ధర మరింత పెరిగింది.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /21.9

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు పడే అవకాశం ఉంది. తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

7న జాబ్ మేళా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వివిధ ప్రైవేట్ సంస్థల్లో 150 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 7న జాబ్‌మేళా నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి మహమ్మద్ జానీపాషా ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్లలోని విర్కో పెట్రోకెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మైక్రో బయాలజిస్ట్ అండ్ కెమికల్‌గా పనిచేసేందుకు బీఎస్సీ, ఎమ్మెస్సీ లైఫ్ సైన్సెస్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, భారత్ పే క్యూఆర్ కోడ్స్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేసేందుకు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. అలాగే జగతి పబ్లికేషన్స్‌లో మార్కెటింగ్ అండ్ టీం కో–ఆర్డినేషన్‌గా పనిచేసేందుకు పదోతరగతి, ఇంటర్మీడియెట్ ఆపై చదివిన వారు అర్హులని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు శనివారం ఉదయం 10.30 గంటలకు మహబూబ్‌నగర్ పిల్లలమర్రి రోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. 18 నుంచి 28 ఏళ్ల లోపు వారు అర్హులని, తప్పక ఆధార్‌కార్డు, బయో–డేటా ఫారం వెంట తెచ్చుకోవాలని, ఎంపికైన వారు ఆయా పోస్టుల వారీగా నెలకు రూ.11 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.95502 05227, 99485 68830, 99126 05508లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నేటినుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఏ –1 పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. తరగతుల వారికి రెండు సెషన్స్‌లో పరీక్షలు ఈనెల 11 వరకు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. అన్ని ప్రశ్నాపత్రాలను పాఠశాలలకు ఇప్పటికే పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రవీందర్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13లోగా దరఖాస్తులకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఓటర్ల లెక్క తేలింది

పురుషుల కంటే మహిళలే అత్యధికం

- 13 నియోజకవర్గాల్లో 30,53,862 మంది ఓటర్లు
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితా విడుదల



13 నియోజకవర్గాల్లో ఓటర్లు ఇలా..

పురుషులు 15,25,132

మహిళలు 15,28,661

ఇతరులు 69

సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ఎన్నికల సంఘం బుధవారం ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఒక్క షాద్‌నగర్‌ను మినహాయించి కల్వకుర్తి, కొడంగల్‌తో సహా 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30,53,862 మంది ఓటర్లు ఉన్నారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర, గద్వాల, అలంపూర్, నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,529 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

వనపర్తిలో అత్యధికంగా 2.65లక్షల ఓటర్లు..

ఉమ్మడి జిల్లా పరిధిలో వనపర్తి నియోజకవర్గంలో అత్యధికంగా మొత్తం 2,65,622 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 1,32,971 మంది పురుష ఓటర్లు ఉంటే 1,32,644 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఏడుగురు ఉన్నారు. అత్యల్పంగా జడ్చర్ల నియోజకవర్గంలో 2,12,384 మంది ఓటర్లు ఉన్నారు. కాగా.. రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వెళ్లిన షాద్‌నగర్‌లో 2,25,470 మంది ఓటర్లు ఉన్నారు. వీరే కాకుండా కొడంగల్‌లో 164, నారాయణపేటలో 165, మహబూబ్‌నగర్‌లో 322, జడ్చర్లలో 260, దేవరకద్రలో 197, మక్తల్‌లో 63, వనపర్తిలో 221, గద్వాలలో 34, అలంపూర్‌లో 60, నాగర్‌కర్నూల్‌లో 233, అచ్చంపేటలో 173, కల్వకుర్తిలో 134, కొల్లాపూర్‌లో 181, షాద్‌నగర్‌లో 54 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. వీరితో పాటు

ఎన్నికల నోటిఫికేషన్‌పై ఉత్కంఠ..

అధికార యంత్రాంగం ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేయడంతో అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండేందుకు ఇప్పటికే అన్ని పార్టీలు క్షేత్రస్థాయిలో ఉండి తమ ప్రయత్నాలను మొదలుపెట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా ఓ వైపు కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల పర్యటనలు, మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీలు, నేతల సభలు, సమావేశాలతో ఎన్నికల హడావుడి మొదలైంది.



కలెక్టరేట్లో ఓటరు జాబితాను విడుదల చేస్తున్న సీ-సెక్షన్ సూపరింటెండెంట్ అఖిల ప్రసన్న, సెక్షన్ అధికారి జాఫర్

ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
మహబూబ్‌నగర్	2,43,367	1,21,397	1,21,960	10
జడ్చర్ల	2,12,395	1,06,922	1,05,469	4
దేవరకద్ర	2,28,084	1,13,528	1,14,556	0
నాగర్‌కర్నూల్	2,24,631	1,12,657	1,11,971	3
అచ్చంపేట	2,33,565	1,17,124	1,16,439	2
కొల్లాపూర్	2,29,399	1,16,975	1,12,420	4
వనపర్తి	2,65,622	1,32,971	1,32,644	7
గద్వాల	2,53,869	1,24,763	1,29,096	10
అలంపూర్	2,36,076	1,16,989	1,19,080	7
నారాయణపేట	2,27,367	1,12,697	1,14,668	2
మక్తల్	2,38,586	1,17,576	1,21,009	1
కల్వకుర్తి	2,30,650	1,17,393	1,13,250	7
కొడంగల్	2,30,251	1,14,140	1,16,099	12
షాద్‌నగర్	2,25,470	1,13,872	1,11,583	15

పెరిగిన 71,421 ఓట్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో కలిపి 6,83,846 మంది ఓటర్లు ఉన్నారు. 2018 ఎన్నికల తుది జాబితా కంటే ప్రస్తుతం 71,421 ఓట్లు పెరిగాయి. ఇందులో పెరిగిన ఓట్లలో పురుషులు 34,401, మహిళలు 37,030 మంది ఉన్నారు. అన్ని పోలింగ్‌కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులపై తుది ఓటరు జాబితాను అతికించారు. కాగా.. ఓటరు జాబితాను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని, తహసీల్దార్లతో పర్యవేక్షించడంతో పాటు రాజకీయపార్టీలతో సమావేశాలు నిర్వహించి తప్పొప్పులను సరి చేసినట్లు అడిషన్ కలెక్టర్ మోహన్‌రావు పేర్కొన్నారు.



పారదర్శకంగా ఓటరు తుది జాబితా

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తుది ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు ఉండకూడదని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ స్పెషల్ సెక్రటరీ భారతి లక్పతినాయక్ అన్నారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమావేశమై ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, వాటి పరిష్కారం, తుది ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం చేసిన వివరాలను ఆయా మండలాల వారీగా పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుది ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు ఉండకూడదని, పూర్తిపారదర్శకంగా ఉండాలన్నారు. దివ్యాంగ ఓటర్లు, సీనియర్ సిటిజన్లు, ప్రముఖుల పేర్లు వచ్చాయా లేనిది చూసుకోవాలన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో తప్పొప్పులు సరిచేసిన తర్వాత, అభ్యంతరాలను పరిష్కరించి ఓటరు జాబితాలో ఉన్న వారందరూ తుది జాబితాలో వచ్చేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా నేరం చేసిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. చనిపోయిన ఓటర్ల పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల పేర్లను తొలగించాలని, వీటన్నిటి తర్వాతే తుది జాబితాను ప్రచురించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. నిర్దేశించిన అన్ని కార్యాలయాలలో తుదిఓటరు జాబితాను బుధ వారమే ప్రచురించాలని, అంతేకాక ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల ని ఆదేశించారు. రెవెన్యూ ఆదనపు కలెక్టర్ మోహన్‌రావు, నారాయణపేట ఆర్డీఓ రామచందర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నటరాజ్ పాల్గొన్నారు.

కోనసీమగా 'పాలమూరు'



మహిళలకు బతుకమ్మ చీరలు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- నాడు కూలి కరువు.. నేడు కూలీల కరువు
- ఉమ్మడి జిల్లా రూపురేఖలే మారాయి
- పీఆర్‌ఎల్‌ఐఎస్‌లో కాల్వల తవ్వకమే మిగిలి ఉంది
- ప్రగతి నివేదన బహిరంగసభల్లో రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు
- కోస్గి, మక్తల్, దేవరకద్ర, కొత్తకోటలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వనపర్తి/కొత్తకోట: 'పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పెద్ద పనులన్నీ పూర్తయ్యాయి.. కేవలం కాల్వల తవ్వకమే మిగిలి ఉంది.. ఏడాదిలో పూర్తి చేస్తాం.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి గుంటకూ నీరందిస్తాం' అని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇప్పటికే పాలమూరు పచ్చబడ్డది.. సమీప భవిష్యత్‌లో పాలమూరును మరో కోనసీమగా చేసి చూపిస్తామన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నిర్మించనున్న 30 పడకల ఆస్పత్రి, దేవరకద్రలో నిర్మించనున్న 100 పడకల హాస్పిటల్‌కు బుధవారం ఆయన కొత్తకోట వేదికగా శంకుస్థాపన చేశారు. దీంతో పాటు మదనాపురంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నారాయణపేట జిల్లా కోస్గి, మక్తల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభల్లో మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సమృద్ధిగా అందుతున్నాయన్నారు. 60 ఏళ్ల గత పాలకుల హయాంలో చేయలేని అభివృద్ధిని తెలంగాణ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసి చూపించామన్నారు.

■ చరిత్రలో లిఖించదగిన విధంగా వైద్యరంగాన్ని బలోపేతం చేశామన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వైద్యశాఖ మంత్రి ఉండే వారు.. ఆయన ఈ జిల్లాకు ఒక్క డయాలసిస్ సెంటర్ కూడా మంజూరు చేయించలేదని విమర్శించారు. కానీ ఇప్పుడు కొత్తకోట, దేవరకద్ర లాంటి సెంటర్లకు కూడా డయాలసిస్ సెంటర్‌తో పాటు ప్రతి నియోజకవర్గానికి వంద పడకల ఆస్పత్రి, ప్రతి జిల్లాకు మెడికల్ పాఠశాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

రైతును రాజును చేసిన నాయకుడు కేసీఆర్

దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ వారి అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేశారని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతును రాజును చేసే నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాసులు, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజిని, వనపర్తి కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మున్సిపాల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని తదితరులు పాల్గొన్నారు.

'ఆల'పై ప్రశంసల జల్లు..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత దేవరకద్ర నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పనితీరుపై హరీశ్‌రావు ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమకాలం నుంచి ఆయనతో కలిసి పనిచేస్తున్నామని.. ఎప్పుడు చూసినా దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధికే తపిస్తాడని.. ఆయన లాంటి నాయకుడు ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. నియోజకవర్గానికి ఎక్కడైనా రెండు ఆస్పత్రులు చూశారా.. పట్టుబట్టి దేవరకద్రలో 100, కొత్తకోటలో 30 పడకల ఆస్పత్రిని సాధించుకున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో లక్ష మెజారిటీతో ఆలని గెలిపించుకోవాలని మంత్రి చెప్పగా.. సభ ఈలలు, నినాదాలతో మార్మోగింది. అనంతరం మంత్రి చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్లు, బతుకమ్మ చీరలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



కొత్తకోటలో బహిరంగసభకు హాజరైన జనం

లక్ష ఎకరాలకు సాగు నీరు..

రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా దేవరకద్ర నియోజకవర్గంలో 18 చెక్‌డ్యాంలు నిర్మించుకున్నామన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేసి దేవరకద్రలో మరో 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా కెనాల్స్ సిద్ధమవుతున్నాయన్నారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్లు, నియోజకవర్గంలో రెండు మున్సిపాలిటీలు ఏర్పాటు చేసుకొని పట్టణీకరణ చేశామన్నారు. ఒక్కో మున్సిపాలిటీకి రూ.40 కోట్ల నిధుల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ప్రకటించారు. దేవరకద్ర నియోజకవర్గంలో రూ.250 కోట్ల వ్యయంతో రెండు చెక్‌డ్యాంను నిర్మించుకున్నట్లు తెలిపారు. దీంతో 36 వేల ఎకరాల నుంచి నేడు లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు.

■ కేసీఆర్ అంటే నమ్మకం.. కాంగ్రెస్ అంటే నాటకం అని హరీశ్‌రావు విమర్శించారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏం చేస్తున్నదో అక్కడి ప్రజలను అడగండి.. ఇంట్లో, బాయి కాడా కరెంట్ ఉంటలేదని చెబుతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపోళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

■ చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంటే సరిపోతుందని అంటున్నారు.. కేసీఆర్ 24 గంటలు ఇస్తమంటున్నారు.. ఏ కరెంట్ కావాలో చేతులెత్తాలని మంత్రి ప్రశ్నించారు. అందరూ కేసీఆర్‌కే జై అంటూ చేతులెత్తగా.. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా లెంపలేసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

■ సీఎం కేసీఆర్ ఆలోచనలతో తెలంగాణ సమగ్రాభివృద్ధి దిశగా ముందుకుపోతోందన్నారు. రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలతో వ్యవసాయరంగం మెరుగుపడిందని.. రైతు గౌరవాన్ని పెంచిన సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. అప్పటి నేతలు జై జవాన్.. జైకిసాన్ అని నినాదాలకే పరిమితమయ్యారని.. దాన్ని కేసీఆర్ నిజం చేసి చూపించారన్నారు. ఒకప్పుడు సాగు లేక, పనులు దొరక్క పాలమూరు కూలీలు వలస బాట పట్టారని.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు పాలమూరుతోపాటు తెలంగాణకు ఉపాధి కోసం వస్తున్నామన్నారు. నాడు కూలి కరువు కాగా.. నేడు కూలీలు కరువయ్యారని.. ఇది తెలంగాణ సాధించిన ప్రగతి కాదా అని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో నంబర్‌వన్ చేస్తాం

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



జీఓ కాపీని ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులకు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అన్ని రంగాల్లో జిల్లాను నంబర్ వన్ చేస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో కొత్త ఆడిటోరియం నిర్మాణానికి రూ.5 కోట్లు, ఎదిర శివారులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి రూ.25కోట్ల నిధుల జీఓ బుధవారం విడుదలైనట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు ఏనుగొండలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులకు మంత్రి ఉత్తర్వుల కాపీని అందజేశారు. సుమారు 4వేల మందికి పైగా విద్యార్థులు ఉన్న డిగ్రీ కళాశాలలో ఆడిటోరియం ఏర్పాటు కోసం దశాబ్దాలుగా డిమాండ్ ఉందని, గతంలో ఎవరూ స్పందించలేదన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేసీఆర్ సహకారంతో పెద్ద స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్‌కుమార్, సత్యనారాయణ, శివలీల, తిరుపతయ్య, ఈశ్వరయ్య, మల్లికార్జున్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా తెలంగాణలో జీతభత్యాలు, ఐఆర్‌పై ప్రభుత్వం పునః సమీక్షిస్తుందని పెండింగ్ డీఏలు, ఈహెచ్‌ఎస్ అమలయ్యేలా చూస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం టీఎస్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి ఐఆర్‌పై పునరాలోచన చేయాలని కోరారు. పెండింగ్ డీఏలు త్వరగా ఇచ్చేలా చూడాలన్నారు. ఈహెచ్‌ఎస్ పథకాన్ని అమలు చేయాలని ఈ అంశాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఇచ్చిన ఐఆర్‌ను సవరించి మరింత మంచిగా చేద్దామన్నారు. రాబోయే పీఆర్సీలోనూ అత్యధిక వేతనాలు వస్తాయని భరోసానిచ్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి రెండు పీఆర్సీలు ఊహించిన దానికంటే అధికంగానే ఇచ్చారన్నారు. పాత పింఛన్ విధానం తిరిగి తీసుకువచ్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తారని, తిరిగి ఏర్పడే కేంద్ర ప్రభుత్వంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించి పాత పింఛన్ విధానం అమలయ్యేలా చూస్తారన్నారు. కార్యక్రమంలో టీఎస్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, సత్యనారాయణగౌడ్, నంద కిషోర్ తదితరులు ఉన్నారు.

7న క్రికెట్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి జిల్లా బాలబాలికల క్రికెట్ ఎంపికలను ఈనెల 7న ఉదయం 9 గంటలకు గద్వాలలోని మినీ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు ఇంటర్ బోనఫైడ్, ఎస్ఎస్‌సీ జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం 98859 55633 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తే కఠినచర్యలు

మహబూబ్‌నగర్ క్రైం: సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోపణలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా వ్యక్తులు, సంస్థలు ఇతరులపై తప్పుడు ఆరోపణలు చేసిన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాలను వేదిక చేసుకుని తప్పుడు పోస్టులు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు పోస్టులు చేయడానికి వినియోగించిన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్, ట్యాబ్‌లతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. సాక్ష్యాల సేకరణ, దర్యాప్తులో భాగంగా వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రం మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 160 మంది క్రీడాకారులు హాజరైనట్లు జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో డీవైఎస్ఓ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శులు యూ.శ్రీనివాసులు, సూర్యప్రకాశ్, జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు, టీజీపెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్, వేణుగోపాల్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

క్లుప్తంగా

బోయిన్‌పల్లిలో యువకుడి బలవన్మరణం

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లిలో కటికె గణేష్(36) బుధవారం ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్‌ఐ శివ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. గ్రామస్తులు, ఎస్‌ఐ కథనం మేరకు గ్రామానికి చెందిన గణేష్ రెండేళ్ల క్రితం భార్యను హత్య చేసి, జైలుకు వెళ్లి వచ్చాడు. ఇంట్లో ఒక్కడే ఉండడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన్నట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

భార్యతో గొడవపడి భర్త..

అమరచింత: భార్యతో గొడవపడి భర్త సూర్య నాయక్ (34) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని కొత్తతండాలో చోటుచేసుకుంది. భార్య భాగ్యమ్మతో కొన్ని రోజులుగా సంసార వ్యవహారంలో గొడవలు పడేవారని స్థానికులు తెలిపారు. బుధవారం మధ్యరాత్రి భార్యతో గొడవ పడిన సూర్యనాయక్ ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు.

స్వల్పంగా తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. బుధవారం రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టుకు 6వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 95, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, భీమా లిఫ్టు-1కు 650, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 856.2 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 856.2 అడుగుల వద్ద 95.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు ద్వారా వెయ్యి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,688, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,360 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.587 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 1,104 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 141 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

- ప్రతి నియోజకవర్గంలోని ఒక పాఠశాలలో టిఫిన్ అందించనున్న ప్రభుత్వం
- 6న ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు
- ఉప్మా, పొంగలి, చిరుధాన్యాలతో వివిధ రకాలు పెట్టే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 3 వేలకు పైగా పాఠశాలల్లో 2.80 లక్షల మంది విద్యార్థులు
- ఆరోగ్యంగా, శారీరక ఎదుగుదలకు తోడ్పాటు



మహబూబ్‌నగర్ మాడల్ బేసిక్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు (ఫైల్)

విద్యార్థులకు అల్పాహారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తేనే.. వారు ఆరోగ్యంగా ఎదుగుతారనే నానుడిని ప్రభుత్వం నిజం చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఏ విద్యార్థి కూడా ఆకలితో బడికి రావద్దనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన టిఫిన్ అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 24న ప్రారంభించాలని ప్రభుత్వం భావించినా.. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉండటంతో పథకానికి ఆటంకం కలుగకుండా ఈ నెల 6న ఈ పథకాన్ని ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం అవుతున్నారు. అందు కోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాల చొప్పున 14 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. వీటిలో ఈ నెల 6న ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు. ఇటీవల ప్రభుత్వం 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు రాగి అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీన్ని వారంలో మూడు రోజులు అందిస్తున్నారు. కాగా కొన్ని సంవత్సరాలుగా అన్ని తరగతుల వారికి మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. తాజాగా టిఫిన్లు పెట్టడం పాఠశాలల్లో కొత్త మైలు రాయిని చేరుకోనున్నట్లు పలువురు హర్షిస్తున్నారు.

ఎవరికి అప్పగిస్తారో..

ఈ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో 3,170 ప్రభుత్వ పాఠశాలల్లో 2.80లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం పొందనున్నారు. టిఫిన్ల పంపిణీని ఎవరికి అప్పగిస్తారనే అంశంలో కొంత సందిగ్ధత నెలకొంది. కొన్ని మండలాల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు భోజనం పెట్టగా.. కొన్ని మండలాల్లో అక్షయపాత్ర ద్వారా భోజనం పెడుతున్నారు. వీటిలో ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారు? లేదా మధ్యాహ్నం భోజనం తరాహార అలాగే టిఫిన్లు కూడా కొనసాగిస్తారా.. అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

నియోజకవర్గానికి ఒక పాఠశాల..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ప్రతి మున్సిపాలిటీలో ఒకటి చొప్పున 14 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 3 నియోజవర్గాలు ఉంటే దేవరకద్రలో కోడ్గల్ హైస్కూల్, దేవరకద్రలో బాలికల హైస్కూల్, మహబూబ్‌నగర్‌లో మాడల్ బేసిక పాఠశాల, నారాయణపేట్ గ్రౌండ్ హైస్కూల్, మక్తల్‌లో జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ బాయ్స్, కాగా నాగర్‌కర్నూల్‌లో పీఎస్ సంజయ్‌నగర్, కల్వకుర్తిలో పీఎస్ వెల్దండ, కొల్లాపూర్‌లో పీఎస్ కొండూరు, అచ్చంపేటలో జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్, గద్వాల జిల్లాలో ఆలంపూర్‌లో జెడ్పీహెచ్ఎస్ దార్మారం, గద్వాలలో జెడ్పీహెచ్ఎస్ వీరాపురంలో పథకాన్ని ప్రారంభించనున్నారు.



శివశక్తినగర్ పాఠశాలలో విద్యార్థులకు రాగి జావాను వడ్డిస్తున్న దృశ్యం(ఫైల్)

శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు..

ఈ పథకంలో భాగంగా టిఫిన్‌లోకి ఉప్మా, పొంగలి, మిల్లెట్స్‌తో టిఫిన్‌లతో పాటు పలు రాకాలైన టిఫిన్లు పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా విద్యార్థులకు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు అవకాశాలున్నాయని పలువురు టీచర్లు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి మెనూ పెడతారని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

గుణాత్మక విద్య అందించేందుకు సహకారం..



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకమైన విద్యను అందించేందుకు ఈ టిఫిన్లు పెట్టే కార్యక్రమం ఎంతో సహకారం అందించనుంది. ఈ నెల 6న ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రారంభించనున్నాం. విద్యార్థులు పాఠశాలకు డ్రాప్ అవుట్, అబ్‌సెంట్లు లేకుండా నిరోధించే అవకాశం ఉంటుంది. ప్రతి రోజు వివిధ రకాల టిఫిన్లు అందించడం గొప్ప విషయం. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్, నారాయణపేట

ఖాళీ కడుపుతో ఉండకుండా..



పలువురు పేద విద్యార్థులు అనేక కారణాలతో పాఠశాలకు ఖాళీ కడుపున వస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి. ఈ నెల 6న నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 4 నియోజకవర్గాల్లో 4 పాఠశాలల్లో ప్రభుత్వం ప్రారంభించనుంది. దీని ద్వారా విద్యార్థులు ఆరోగ్యకరంగా శారీరకంగా ఎదుగుతారు. ఈ పతకం ద్వారా పాఠశాలల్లో మరిన్ని అడ్మీషన్లు పెరిగే అవకాశం ఉంది.

– గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్

భక్తుల సౌకర్యార్థం కొత్త ఆలయ నిర్మాణం

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: భక్తుల సౌకర్యార్థం నాయనోనిపల్లి మైసమ్మ ఆలయం నిర్మించామని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయాన్ని మంత్రి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కొత్త ఆలయం ప్రారంభించడం తన అదృష్టమన్నారు. రూ.2కోట్ల35 లక్షలతో అన్ని సౌకర్యాలతో నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

బాచారం హైలేవల్ కెనాల్ శంకుస్థాపన..

యాపట్ల వద్ద బాచారం హై లెవల్ కెనాల్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. మారేడుదిన్నె సమీపంలో ఉన్న పెద్దవాగుపై చెక్ డ్యాంల నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి కొత్తగా చేపట్టబోయే బాచారం హైలెవల్ కెనాల్ కాల్వ ద్వారా పెద్దకొత్తపల్లి, బాచారం, పెద్ద కార్పాముల, చిన్నకార్పాముల, జగన్నాథ్‌పురం, యాపట్ల, మారేడుదిన్నె, నార్లాపూర్‌కు సాగునీరు అందించేందుకు రూ.31.80 కోట్లు కాల్వ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో కాల్వ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కాల్వ నిర్మాణానికి నిధుల కొల్లాపూర్ ఎమ్మెల్యే ఎన్నోసార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కాల్వ నిర్మాణం ద్వారా 6వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌గౌడ్, నాగరాజు, సర్పంచ్‌లు సునీత, శ్రీకృష్ణ, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

తెలంగాణలో కులగణన చేపట్టాలి

- బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యరావు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బీహార్ రాష్ట్రంలో చేపట్టిన విధంగా తెలంగాణలో కూడా కులగణన చేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యరావు డిమాండ్ చేశాడు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక వనరులు, సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు సమానంగా అందాలంటే కులాల వారీగా లెక్కలు తేలాల్సిందేనన్నారు. బీసీ మహిళా బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కోటాను అమలు పరిచే విధంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్, సత్యం, మహేందర్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యరావు

అక్రమ కట్టడాల కూల్చివేత



క్రిష్టియన్‌పల్లి శివారులో జేసీబీతో ఇళ్ల నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్: కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇళ్లను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలం క్రిష్టియన్‌పల్లి రెవెన్యూ శివారులో గల 523 సర్వేనంబర్ భూమిలో కొంతమంది దళారులు ప్లాట్లుగా చేసి విక్రయించారు. దళారుల నుంచి బోగస్ పట్టాలు పుచ్చుకున్న కొంతమంది అక్కడ ఇళ్లను నిర్మించుకున్నారు. వీటిపై వచ్చిన ఫిర్యాదులు కొంతకాలంగా పట్టించుకోలేని రెవెన్యూ అధికారులు ఒక్కసారిగా బుధవారం జేసీబీ యంత్రాలతో పాటు పోలీసు రక్షణతో చేరుకుని కూల్చివేత చర్యలు చేపట్టారు. ఒక ఇంటిని పూర్తిగా నేలమట్టం చేయగా, మరో 6-7 ఇళ్లను పాక్షికంగా కూల్చివేశారు. కలెక్టర్ రవినాయక్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ నాగార్జున పోలీసుల సహకారంతో తమ సిబ్బందిని తీసుకెళ్లి కూల్చివేత చర్యలకు దిగడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఇతర జిల్లాకు చెందిన ఓ వ్యక్తి 523 సర్వేనంబర్‌లో గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని తమ గుప్పిట్లో పెట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, బడా నాయకుల పేర్లు చెప్పుకుని ఈ దందా కొనసాగించినట్లు అక్కడి ప్రజలు తెలిపారు. విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో ఆయన చర్యలు తీసుకోవాల్సిందిగా తహసీల్దార్‌ను ఆదేశించారు. కూల్చివేతల అనంతరం తిరిగి ఈ ఇళ్ల నిర్మాణం చేపడితే రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూమిలో తమకు ప్లాట్లు అమ్మిన అసలు దళారులను పట్టుకుని శిక్షించాలని బాధితులు అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేస్తున్నారు.

- నడిరోడ్డుపై అన్నను కత్తులతో నరికి చంపిన తమ్ముళ్లు
- వనపర్తి జిల్లాకేంద్రంలో ఘటన
- వీపనగండ్లలో ఎంపీఓగా పనిచేస్తున్న హతుడు

ఆస్తి కోసం అమానుషం



మృతుడు బద్రీనాథ్ (ఫైల్)

వనపర్తి: ఆస్తి ముందు అన్నదమ్ముల అనుబంధం, చిన్నప్పటి నుంచి కలసి ఉన్న సోదర ప్రేమ చిన్నబోయాయి. నడిరోడ్డుపై సొంత తమ్ముళ్లే తోడబుట్టిన అన్నను కత్తులతో వేటాడి హత్య చేశారు. బుధవారం వనపర్తి జిల్లాకేంద్రంలో ఈ దారుణ ఘటన చోట చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి మండలం రాజపేట పెద్దతండాకు చెందిన మంగ్లీ, పూల్య నాయక్‌లకు ఐదుగురు కుమారులున్నారు. 20 ఎకరాల భూమిని తండ్రి తన కుమారులకు సమానంగా పంచి ఇచ్చాడు. రెండో కుమారుడు బద్రీనాథ్ నాయక్ (51) వీపనగండ్లలో ఎంపీఓగా పనిచేస్తున్నారు. ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలే ఉండడంతో వంశోద్ధారకుడు లేడని.. తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తిని పేదలైన తమ్ముళ్లకు ఇవ్వాలనే ప్రతిపాదన కుటుంబంలో తెచ్చారు. అందుకు బద్రీనాథ్ ఒప్పుకోకపోవడంతో, తాను పంచి ఇచ్చిన భూమిని తిరిగి ఇవ్వాలని తండ్రి డిమాండ్ చేయడంతో పాటు కోర్టుకు సైతం వెళ్లాడు. దీంతో అప్పటి నుంచి అన్నదమ్ముల మధ్య విభేదాలు మొదలయ్యాయి. పదేళ్లుగా ఈ ఆస్తి వివాదం కోర్టులో కొనసాగుతుండగానే.. చాలాసార్లు ఘర్షణపడ్డారు. సోదరుల నుంచి ప్రాణభయం ఉండటంతో బద్రీనాథ్ కొంతకాలంగా బయట తిరిగే సందర్భంలో హతీరాం అనే వ్యక్తిని వెంటబెట్టుకునేవారు. బుధవారం విధి నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌కు వచ్చిన బద్రీనాథ్ తిరిగి వెళుతుండగా.. ఇద్దరు తమ్ముళ్లు సర్దార్ నాయక్, కోట్యా నాయక్‌తో పాటు సర్దార్ నాయక్ కుమారుడు పరమేశ్‌లు కాపుకాసి మరికుంట సమీపంలో కత్తులతో దాడి చేశారు. నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా విచక్షణారహితంగా నరకడంతో బద్రీనాథ్ అక్కడికక్కడే మృతి చెందారు. పక్కనే ఉన్న హతీరాంకు కత్తి గాయం కావడంతో భయంతో పరారయ్యాడు. అనంతరం రెండు బైక్‌లపై నిందితులు అక్కడి నుంచి పారిపోయి.. వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, నిందితులు తమ అదుపులో ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మహేశ్వర్‌రావు తెలిపారు.



కత్తులతో దాడి చేయటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందిన బద్రీనాథ్ నాయక్

వీపనగండ్లలో విషాదఛాయలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న బద్రినాథ్‌నాయక్ బుధవారం జిల్లా కేంద్రంలో హత్యకు గురికావడంతో ఎంపీడీఓ కార్యాలయంతో పాటు, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 1999లో మొదటిసారిగా ఉద్యోగంలో చేరిన ఈయన ఉమ్మడి వీపనగండ్ల మండలంలోని పెద్దమారులో మొదటిసారిగా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత బల్మూరు, కొత్తకోట, పెబ్బేరు పట్టణాలలో పనిచేసి, 2017లో వీపనగండ్ల కార్యదర్శిగా విధుల్లో చేరారు. ఎంపీఓగా పదోన్నతి లభించినా మండల కేంద్రంలోనే విధులు నిర్వహించారు. మండలాల ఏర్పాటుతో కొత్తగా ఏర్పాటైన చిన్నంబావి మండలానికి మొదటి ఎంపీడీఓగా పనిచేస్తూ కొద్ది నెలల్లోనే తిరిగి వీపనగండ్ల ఎంపీఓగా వచ్చారు. దాదాపు 5ఏళ్లకు పైబడి మండల ప్రజలతో సంబంధాలు నెలకొన్న బద్రినాథ్ మృతిపై పలువురు తమ సంతాపాన్ని తెలియజేశారు.

బాలిక ఆత్మహత్య కేసులో ఇద్దరి రిమాండ్

మిడ్జిల్: బాలిక ఆత్మహత్య కేసులో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు గురువారం తెలిపారు. మండలంలోని రాణిపేటకు చెందిన బాలిక ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు అదే గ్రామానికి చెందిన రవి, ఆంజనేయులు కారణమని తేలటంతో వారిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దొరికిన నగదు పోలీసులకు అప్పగింత



అయిజ: పట్టణంలోని వెటర్నరీ ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బుధవారం పట్టణానికి చెందిన ఉప్పరి రవికి రూ. 50 వేల నగదు దొరికింది. వెంటనే అతను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నగదును అప్పగించారు. దీంతో పోలీసులు అయన నిజాయితీని మెచ్చుకున్నారు. విచారణ చేసి డబ్బు పోగొట్టుకున్న వ్యక్తికి అందజేస్తామని ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే మర్రి యాత్రకు నిరసన సెగ

బిజినేపల్లి: నల్లమట్టి అక్రమ రవాణాను అడ్డుకోబోయిన రైతులపై కేసులు పెట్టించాడని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని ఆ గ్రామానికి చెందిన రైతులు, విపక్షాల నాయకులు బుధవారం రాత్రి అడ్డుకుని ప్రశ్నించబోయారు. అక్కడే ఉన్న పోలీసులు ముందస్తుగానే విషయం పసిగట్టి వారిని ఎక్కడికక్కడే నిలువరించారు. పదేళ్ల ప్రజా ప్రస్థానంలో 'మర్రన్న యాత్ర'లో భాగంగా బుధవారం రాత్రి మండలంలోని మంగనూర్‌లో ఎమ్మెల్యేకు ప్రజల నుంచి నిరసన సెగ తాకింది. గ్రామానికి చెందిన చెరువులోని నల్లమట్టిని ప్రాజెక్టుల కోసం తరలించవద్దని అడ్డుకున్న రైతులపై ఎమ్మెల్యే అక్రమ కేసులు పెట్టించాడని ఆరోపించారు. అంతేకాకుండా గ్రామంలో ట్రాక్టర్ల సాయంతో మట్టిని తరలిస్తుంటూ వాహనాలపై కూడా కేసులు చేయించి, ఇప్పుడు గ్రామంలో యాత్ర చేయడానికి ఏమి అర్హత ఉందని ప్రశ్నించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే వాహనం అడ్డుకునేలోపు అక్కడి నుంచి ఆ వాహనం వెళ్లిపోయింది. విషయం గమనించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. గ్రామస్తులు పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంటుందనే సమయంలో, పోలీసులు సయమనంతో వారికి సమాధానం చెప్పి గుంపులను చెదరగొట్టారు.



తోసుకుంటున్న పోలీసులు, గ్రామస్తులు

ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన డీటీడీఓ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆశ్రమ పాఠశాలను బుధవారం సాయంత్రం డీటీడీఓ కమలాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత నెల 25న 'సాక్షి' దినపత్రికలో జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో కరువైన సౌకర్యాలపై 'తాగునీటికి తిప్పలే'.. శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. స్టాక్ రూంలోని జీసీసీ నుంచి సరఫరా అయిన సరుకుల వివరాలను హెచ్ఎం మల్లేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సరుకు ప్యాకెట్లు, నాణ్యత, ఇతర వివరాలను పరిశీలించారు. వంట గది పరిసరాలు, తాగునీటితో పాటు భోజన నాణ్యతను చూశారు. అంతకుముందు విద్యార్థుల హాజరు, వారికి రావాల్సిన అన్ని సౌకర్యాలు అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు చక్కని బోధన అందించాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు శంకర్, తిర్పతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

మళ్లీ పెరిగిన ఉల్లి ధర

- గరిష్ఠంగా రూ. 2,880, కనిష్ఠంగా రూ. 2,230

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన వేలంలో ఉల్లి ధర మరింత పెరిగింది. రెండు నెలల నుంచి కొద్దికొద్దిగా ధరలు పైపైకి పోవడమేతప్పా కిందకు రావడం లేదు. గత సీజన్‌లో రూ. వెయ్యి లోపే ఉన్న ధరలు ప్రతి వారం పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు గత సీజన్‌లో పండించిన ఉల్లినే రైతులు అమ్మకానికి తెస్తున్నారు. ఇప్పటి వరకు అమ్ముకోకుండా నిల్వ చేసుకున్న రైతులు ధరలు పెరుగుతుండడంతో ప్రతి వారం కొంత తెస్తున్నారు. వానాకాలం సీజన్ కింద వేసిన ఉల్లి మరో రెండు నెలల తర్వాత మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు మార్కెట్‌లో పాత ఉల్లి అమ్మకాలు కొనసాగనున్నాయి.

పోటా పోటీగా వేలం

మార్కెట్‌లో ఉల్లి వేలం పోటాపోటీగా సాగాయి. స్థానిక వ్యాపారులతో పాటు వివిధ మార్కెట్ల నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. నాణ్యంగా ఉన్న ఉల్లికి డిమాండ్ ఉండడంతో ఏకంగా క్వింటాల్ ఉల్లి ధర గరిష్ఠంగా రూ.2,880 వరకు పలికింది. రెండో రకం ఉల్లి కనిష్ఠంగా రూ.2,230 వరకు ధర వచ్చింది. వారం కన్నా గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.130 వరకు ధర అధికంగా పలికాయి. వేలం తర్వాత తూకం వేసిన 45 కేజీల ఉల్లి బస్తా గరిష్ఠంగా రూ.1,450, కనిష్ఠంగా రూ.1,150 వరకు విక్రయించారు. సంతలో కిలో ఉల్లిపాయలు రూ. 30 నుంచి రూ.40 వరకు విక్రయించారు.



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులు

సోనామసూరి క్వింటా రూ. 2,562

మార్కెట్ యార్డులో బుధవారం టెండర్లలో సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,562 ధర నమోదైంది. హంస ధర గరిష్ఠంగా రూ.1,900, ఆముదాల ధర రూ.5,354గా ధరలు వచ్చాయి. మార్కెట్‌లో సీజన్ ప్రారంభం కావడంతో ధాన్యం అమ్మకాలు ప్రారంభమయ్యాయి.

తుమ్మలచెరువు శివారులో మొసలి లభ్యం



తుమ్మలచెరువు శివారులో మొసలి

గట్టు: మండలంలోని తుమ్మలచెరువు శివారులోని బుధవారం ఉదయం గ్రామస్తులు మొసలిని బంధించారు. గ్రామానికి చెందిన నవీన్ రెడ్డి వ్యవసాయ బావి వద్ద మొసలి ఉన్నట్లు గుర్తించారు. దీంతో చుట్టు పక్కల రైతులు కలిసి తాళ్ల సాయంతో బంధించి గ్రామంలోకి తీసుకొచ్చారు. వాగులోంచి దారి తప్పి వచ్చిందా? ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి వచ్చిందా? అనేది తెలియడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు అప్పగించారు.

రెండు జేసీబీలు, మూడు ట్రాక్టర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

రాజాపూర్: మండల శివారులోని దుందుభీనదిలో బుధవారం అనుమతి లేకుండా మట్టిని తోడుతూ కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న రెండు జేసీబీలను, మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఆర్ఐ ఖదీర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో ఇసుక నిషేధం ఉందని అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే వాహనాలు సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఆర్ఐ పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
286	93
65,226	19,436

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ			
నాస్‌డాక్	13,154	▲	95
డోజోన్స్	32,975	▽	27
ఎఫ్‌టీఎస్ఈ 100	7,412	▽	58
డాక్స్	15,100	▲	15
షాంఘై (గురువారం ముగింపు)	3,110	▲	3
నికాయ్	30,527	▽	711

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,653	▽	22
బంగారం (99.5 స్వచ్ఛత)	56,426	▽	22
వెండి (కిలో)	67,446	▲	409

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	98.87	102.21
€	యూరో	ఒకటి	85.63	88.70
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.95	56.65
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.46	53.74
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.65	61.57
SAR	సౌదీ రియాల్	ఐదువందలు	21.27	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	ఐదువందలు	21.80	23.53
¥	చైనా యువాన్	ఐదువందలు	10.28	12.25

సూపర్‌డ్రైతో రిలయన్స్ జత

- 24:76 శాతం వాటాతో జేవీ ఏర్పాటు
- దక్షిణాసియా ఐపీ ఆస్తుల కొనుగోలు

న్యూఢిల్లీ: దక్షిణాసియా మేధో హక్కుల(ఐపీ ఆస్తులు) విక్రయానికి రిలయన్స్ రిటైల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూకే ఫ్యాషన్ రిటైలర్ సూపర్‌డ్రై తాజాగా పేర్కొంది. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ) ద్వారా రిలయన్స్ రిటైల్ 4 కోట్ల పౌండ్లు(రూ. 402 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా స్వెట్‌షర్టులు, హుడీస్, జాకెట్స్ తదితర ఫ్యాషన్ ప్రొడక్టులను రూపొందిస్తున్న సూపర్‌డ్రై.. జేవీలో 24 శాతం వాటాను పొందనుంది. మిగిలిన 76 శాతం వాటా రిలయన్స్ రిటైల్ చేతిలో ఉంటుంది. ఒప్పందం ప్రకారం సూపర్‌డ్రై బ్రాండ్ ఐపీ ఆస్తులు కొత్తగా ఏర్పాటు చేయనున్న జేవీకి శాశ్వతంగా బదిలీకానున్నాయి. రిలయన్స్ బ్రాండ్స్ హోల్డింగ్ యూకేతో ఐపీ జేవీ ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సూపర్‌డ్రై పీఎల్‌సీ.. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. తద్వారా భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో సూపర్‌డ్రై బ్రాండుసహా.. సంబంధిత ట్రేడ్‌మార్క్‌లను జేవీకి బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది.

నిధుల ఆవశ్యకత: సూపర్‌డ్రై ఇటీవల హోల్‌సేల్ కస్టమర్ల నుంచి బలహీన ఆర్డర్ల కారణంగా స్టాక్ నిల్వలు, లిక్విడిటీ తదితర అంశాలలో సవాళ్లు ఎదుర్కొంటోంది. దీంతో జేవీకి తెరతీసింది. దీంతో స్థూలంగా 3.04 కోట్ల పౌండ్ల నగదు లభించనుందని అంచనా వేస్తోంది. కాగా.. తాజా ఒప్పందంతో రిలయన్స్ దక్షిణాసియాలోని మూడు దేశాలలో కార్యకలాపాలు చేపట్టనున్నట్లు సూపర్‌డ్రై తెలియజేసింది. జేవీలో సూపర్‌డ్రై వాటాను కొనసాగించడంతోపాటు.. తమ నైపుణ్యం ద్వారా బ్రాండ్ డెవలప్‌మెంట్, డిజైన్, మార్కెటింగ్‌లలో మద్దతిస్తుందని రిలయన్స్ బ్రాండ్స్ ఎండీ దర్శన్ మెహతా చెప్పారు. భారత్ భారీ అవకాశాల మార్కెట్‌కాగా.. రిలయన్స్‌తో పటిష్ట బంధమున్నట్లు సూపర్‌డ్రై వ్యవస్థాపకుడు, సీఈవో జూలియన్ డంకెర్టన్ పేర్కొన్నారు.

2035 నాటికి ట్రిలియన్ డాలర్లు

- భారత వాహన రంగంపై అంచనా
- ఆర్థర్ డి లిటిల్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం 2035 నాటికి ఎగుమతి ఆధారిత ట్రిలియన్ డాలర్ పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉందని ఆర్థర్ డి లిటిల్ నివేదిక పేర్కొంది. తయారీ, ఆవిష్కరణలు, సాంకేతికత తోడుగా పరిశ్రమ ఈ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది. 'భారత వాహన పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్లకు డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తికి ఆకర్షణీయ ప్రపంచ కేంద్రంగా మారవచ్చు. దీనిని సాధించడానికి ఈ రంగంలోని కంపెనీలు ప్రపంచ తయారీకి అనుగుణంగా తమ సామర్థ్యాలను విశ్వసనీయ, పోటీతత్వంగా మెరుగుపర్చుకోవాలి. జోనల్ ఆర్కిటెక్చర్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటి కొత్త సాంకేతికతలకు అనుగుణంగా పరిష్కారాలను అందించడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ పరిశోధన, అభివృద్ధిలో భారత శక్తి సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. నిధులతో కూడిన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థతో భారతదేశం వాహన రంగంలో నాయకత్వ స్థానంలో ఉండగల సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని వివరించింది.



నాయకత్వ స్థానంగా..: దేశీ వాహన రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణల వేగాన్ని, మారుతున్న సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించినట్లయితే భారతదేశాన్ని ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో నాయకత్వ స్థానంగా మార్చవచ్చని నివేదిక తెలిపింది. 'ప్రపంచవ్యాప్తంగా ఆటోమోటివ్ పరిశోధన, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు వృద్ధి చెంది 400 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశం ప్రపంచ సాఫ్ట్‌వేర్ హబ్‌గా, ఆఫ్‌షోర్ గమ్యస్థానంగా తన స్థానాన్ని ఉపయోగించుకోవచ్చు. భారత వాహన పరిశ్రమ నిజమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వంతో సహా ముడిపడి ఉన్న భాగస్వాముల మధ్య బలమైన చర్చలు, సమిష్టి చర్యలు అవసరం' అని నివేదిక వివరించింది.

నెల కనిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ ప్రతికూల సంకేతాలు
- ఎఫ్ఐఐల వరుస విక్రయాల ప్రభావం

ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం కొనసాగడంతో స్టాక్ మార్కెట్ రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 286 పాయింట్లు పతనమై 65,226 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు క్షీణించి 19,436 వద్ద నిలిచింది. రెండు సూచీలకు ముగింపు స్థాయిలు నెల కనిష్టం. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తత వహించారు. స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు పెద్ద ఎత్తున నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 633 పాయింట్లు నష్టపోయి 65 వేల స్థాయి దిగువన 64,879 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు పతనమై 19,334 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. విదేశీ



ఇన్వెస్టర్లు రూ.4,424 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,769 కోట్ల షేర్లను కొన్నారు.

- అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3% పెరిగి రూ.2464 వద్ద స్థిరపడింది. అబుదాబీ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హోల్డింగ్(ఐహెచ్‌సీ) ఓపెన్ మార్కెట్ కొనుగోళ్ల ద్వారా అదానీలో తన వాటాను 4.98% నుంచి 5.04 శాతానికి పెంచుకోవడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- అప్‌డేటర్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.300)తో 0.03 స్వల్ప డిస్కౌంట్‌తో 299.90 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 6% క్షీణించి రూ.282 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చింది. చివరికి 5.38% నష్టంతో 284 వద్ద నిలిచింది.

షెల్ డీజిల్ లీటర్ 20 పెంపు

లీటర్ విక్రయ ధర రూ.130

న్యూఢిల్లీ: షెల్ ఇండియా తన అవుట్‌లెట్ల ద్వారా విక్రయించే డీజిల్ ధరను లీటర్‌పై రూ.20 పెంచుతున్నట్లు ప్రకటించింది. వారం లోపే రెండో విడత ధరలను పెంచింది. దేశంలో అధిక వాటా కలిగిన ప్రభుత్వరంగ సంస్థలు మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా అవే రేట్లను కొనసాగిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు విక్రయ ధరల్లో ఎలాంటి సవరణలు చేయకపోవడం గమనించొచ్చు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మే నెలలో 75 డాలర్లలోపు ఉంటే, ప్రస్తుతం 95 డాలర్లపైకి చేరుకోవడం తెలిసిందే. షెల్ ఇండియా గత వారం కూడా లీటర్ డీజిల్‌పై రూ.4 చొప్పున పెంచింది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 346 పెట్రోల్ స్టేషన్లు ఉన్నాయి. ముంబైలో లీటర్ డీజిల్‌ను రూ.130కు, చెన్నైలో రూ.129 చొప్పున విక్రయిస్తోంది. పెట్రోల్ లీటర్ ధర రూ.117–118గా ఉంది. అదే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు లీటర్ డీజిల్‌ను రూ.95, లీటర్ పెట్రోల్ ధరను రూ.107 స్థాయిలో విక్రయిస్తుండడం గమనార్హం. ప్రాంతాలను బట్టి ఈ రేట్లలో స్వల్ప మార్పులు ఉంటాయి.



వరల్డ్ కప్ మ్యాచ్‌లకు స్పాన్సర్ల క్యూ..

- 26 స్పాన్సర్లు, 500 పైగా అడ్వర్టైజర్లు
- లిస్టులో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా
- డిస్నీ స్టార్ వెల్లడి

న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభమవుతున్న ఐసీసీ వరల్డ్ కప్ 2023 మ్యాచ్‌లను స్పాన్సర్ చేసేందుకు కంపెనీలు భారీ ఎత్తున క్యూ కడుతున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 26 స్పాన్సర్లు, 500 ప్రకటనకర్తలు నమోదు చేసుకున్నట్లు టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మ్యాచ్‌ల ప్రసార హక్కులను దక్కించుకున్న డిస్నీ స్టార్ స్పోర్ట్స్ విభాగం హెడ్ సంజోగ్ గుప్తా తెలిపారు. వీటిలో చాలా స్పాన్సర్లు టీవీ, డిజిటల్ ఫార్మాట్లను ఎంచుకోగా, కొన్ని కంపెనీలు కేవలం డిజిటల్ లేదా టీవీని మాత్రమే ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో భాగంగా నిర్వహించే 48 మ్యాచ్‌లను డిస్నీ స్టార్ తమ టీవీ చానళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం చేయనుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లు తొమ్మిది భాషల్లో 100 పైచిలుకు కామెంటేటర్స్‌తో డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానున్నాయి. వీటిలో తెలుగు, తమిళం



తదితర భాషలు కూడా ఉన్నాయి. పన్నెండేళ్ల తర్వాత వరల్డ్ కప్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమిస్తోంది.

భారత్‌పై అంచనాలు.. పండుగ సీజన్ దన్ను

ఆసియా కప్‌లో భారత మెరుగైన పనితీరు, పండుగ సీజన్, భారత్ టీమ్‌పై భారీ అంచనాలు తదితర సానుకూలాంశాల కారణంగా అడ్వర్టైజర్లు భారీగా ఆసక్తి చూపుతున్నట్లు గుప్తా చెప్పారు. అన్ని కేటగిరీల కంపెనీలూ స్పాన్సర్ చేసేందుకు లేదా ప్రకటనలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. సాధారణంగా పండుగ సీజన్‌లో కంపెనీలు ప్రకటనలపై భారీగా వెచ్చిస్తుంటాయని తెలిపారు. స్పాన్సర్ల జాబితాలో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా అండ్ మహీంద్రా, డ్రీమ్11, హెచ్‌యూఎల్, హావెల్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పెర్నాడ్ ఇండియా, బుకింగ్ డాట్‌కామ్, పీటర్ ఇంగ్లాండ్, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, మాండెలీజ్, ఎమిరేట్స్, దయాజియో, ఎంఆర్‌ఎఫ్, లెండింగ్‌కార్ట్, బీపీసీఎల్, హెర్బాలైఫ్, హయర్, యాంఫీ, గూగుల్ పే, పాలీక్యాబ్, అమూల్, విడా, అమెజాన్ మొదలైన సంస్థలు న్నాయి. కోకా–కోలా, ఫోన్‌పే, హెచ్‌యూఎల్ వంటి పలు కంపెనీలు ఇటు టీవీ, అటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ స్పాన్సర్ చేస్తున్నాయి.

అనువైన ప్యాకేజీలు..

ప్రకటనకర్తల బడ్జెట్, అవసరాలను బట్టి వారికి అనువైన ప్యాకేజీలను రూపొందించినట్లు గుప్తా చెప్పారు. 'పండుగ సీజన్ సందర్భంగా.. ఎవరైనా అడ్వర్టైజరు దీపావళి సమయంలో ఎక్కువ మంది కస్టమర్లు తమ ఉత్పత్తులపై మక్కువ చూపుతారనే ఉద్దేశంతో పండుగకి ముందు ఓ రెండు వారాలపాటు ప్రకటనలు ఇవ్వదల్చుకున్నారనుకుందాం. కాస్త ప్రీమియం చెల్లించి ఆ వ్యవధిలో మాత్రమే తమ ప్రకటనలను ప్రసారం చేసుకునేందుకు వీలు కల్పించేలా వారికోసం కస్టమైజ్డ్ ప్యాకేజీని అందిస్తున్నాం' అని తెలిపారు. వరల్డ్ కప్‌లో మరింత మంది ప్రకటనకర్తలు భాగమయ్యేందుకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ''సెల్ఫ్–సర్వ్ ఫ్రేమ్‌వర్క్''ను ప్రవేశపెట్టినట్లు గుప్తా తెలిపారు. ఏజెన్సీలు, అడ్వర్టైజర్లు సేల్స్ టీమ్స్ జోక్యం లేకుండా, తమకు అవసరమైన వాటిని స్వయంగా బుక్ చేసుకునే వీలుంటుందని వివరించారు.

ఇంటి వద్దకే ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు

మొబైల్ డివైజ్‌లతో సర్వీసుల ఆవిష్కరణ

ముంబై: అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి చేర్చే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే, చేతిలో ఇమిడిపోయే మొబైల్ హ్యాండ్‌హెల్డ్ పరికరాల ద్వారా కూడా సేవలు అందించే విధానాన్ని ఆవిష్కరించింది. నేరుగా ఖాతాదారుల ఇంటి ముంగిట్లోకే కియోస్క్ బ్యాంకింగ్ సర్వీసులను తీసుకెళ్లేందుకు ఈ విధానం ఉపయోగపడగలదని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఖాతాదారులు మొదలైన వారికి ఇంటి దగ్గరే బ్యాంకింగ్ సర్వీసులు అందించడంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్లకు వీటితో వెసులుబాటు లభిస్తుందన్నారు. నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్లు, ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్స్ వంటి అయిదు రకాల సర్వీసులు ఈ విధానంలో అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు అకౌంటు తెరవడం వంటి ఇతర సేవలను కూడా చేర్చే యోచనలో ఎస్‌బీఐ ఉంది.



భవిత

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో.. Quiz, Drawing, Essay పోటీలు. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే ఈ క్యూఆర్ స్కాన్ చేయండి.. మీ మేధస్సుకు పదును పెట్టి.. ఈ పోటీల్లో పాల్గొనండి.. విజేతలుగా నిలవండి. –ఆల్ ది బెస్ట్..

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

కేంద్ర విద్యాశాఖ దేశవ్యాప్తంగా 650 జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో పదకొండో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ(లేటరల్ ఎంట్రీ)కి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి జవ హర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
» **వయసు:** 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించి ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాతపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు(ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్)ఉంటాయి. మొత్తం 100ప్రశ్నలు –100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికేట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీనితోపాటు అభ్యర్థి ఫోటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 10.02.2024.
» **వెబ్‌సైట్:** navodaya.gov.in

ఐవోసీఎల్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐవోసీఎల్ రీజియన్‌లలో గేట్–2024 ద్వారా గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్–2024 అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్ 2024 స్కోరు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గేట్ 2024 ఫలితాలు వెల్లడి తర్వాత ఐవోసీఎల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.iocl.com

ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో 68 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఫిజిసిస్ట్–02, క్లినికల్ సైకాలజిస్ట్–01, మెడికల్ ఆఫీసర్(ఆయుష్)–01, యోగా ఇన్‌స్ట్రక్టర్–01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–02, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్–04, స్టోర్ కీపర్–04, జూనియర్ ఇంజనీర్–03, జూనియర్ ఫిజియోథెరపిస్ట్–01, జూనియర్ ఆడియాలజిస్ట్/స్పీచ్ థెరపిస్ట్–02, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–01, ఆప్టోమెట్రిస్ట్–02, టెక్నీషియన్(ల్యాబొరేటరీ)–16, టెక్నీషియన్(రేడియాలజీ)–02, ఫార్మసిస్ట్–05, ఫైర్ టెక్నీషియన్–02, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్‌లు–02, స్టెనోగ్రాఫర్–04, లాండ్రీ సూపర్‌వైజర్–01, జూనియర్ వార్డెన్–02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్–10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2/డిగ్రీ/ఎంబీఏ /ఎంఎస్సీ/పీజీ డిగ్రీ/ఎంఏ/పీజీ డిప్లొమా/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ టెస్ట్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in

కాళోజీ వర్శిటీలో ఎంపీటీ ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీటీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు.
» **అర్హత:** బీపీటీ డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 30.09.2023లోపు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2023
» **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

బోధన, పరిశోధనకు.. నెట్

బోధన, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి మార్గం.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! సంక్షిప్తంగా.. యూజీసీ నెట్! ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. రీసెర్చ్‌కు అవకాశం కల్పించే జేఆర్‌ఎఫ్ పొందొచ్చు. మరోవైపు బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులూ దక్కించుకోవచ్చు. యూజీసీ-నెట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా యూజీసీ నెట్-డిసెంబర్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ-నెట్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

» యూజీసీ నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల
» డిసెంబర్ 6 నుంచి 22 వరకు పలు స్లాట్లలో పరీక్షలు
» నెట్‌లో ఉత్తీర్ణతతో జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత
» 80కు పైగా సబ్జెక్ట్‌లలో నెట్ నిర్వహణ

సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో పరిశోధనలకు మార్గాలు అనేకం. కానీ హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో మాత్రం ఆశించిన మేరకు రీసెర్చ్ అవకాశాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారంగా అందుబాటులోకి తెచ్చిన విధానమే.. యూజీసీ–నెట్. దీనిద్వారా సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధన అవకాశాలు అందుకోవచ్చు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలనుకునే వారికి యూజీసీ–నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

83 సబ్జెక్టుల్లో నెట్

యూజీసీ నెట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా 2023 డిసెంబర్ సెషన్‌కు సంబంధించి ప్రకటన ఇచ్చింది. 83 సబ్జెక్ట్‌లలో డిసెంబర్ 6 నుంచి 22 వరకు పరీక్షలను నిర్వహించనుంది. దీని ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రెండు కేటగిరీలుగా

- యూజీసీ–నెట్‌ను సాధారణంగా రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అవి.. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరు కావాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- రీసెర్చ్/జేఆర్‌ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితమవ్వాలనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లలో పరీక్ష

- యూజీసీ నెట్‌ను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్–1.. 50 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇందులో టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, భిన్నమైన ఆలోచన సరళిపై ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2.. 100 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇది అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ పేపర్. ఇందులో అభ్యర్థుల డొమైన్ నాలెడ్జ్ పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన లేదు.

పేపర్ ఎంపిక ఎలా

- అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ..పేపర్–1కు తప్పనిసరిగా హాజరు కావాలి.
- అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పరీక్ష పేపర్ 2. ఉదాహరణకు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు ఎకనామిక్స్ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.



కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే.. కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్–ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

సబ్జెక్ట్‌పై పట్టుతోనే సక్సెస్

ఆరు శాతం మందిని మాత్రమే తుది జాబితాకు ఎంపిక చేసే యూజీసీ నెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలి.

పేపర్-1కు ఉమ్మడిగా

రెండు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహించే పేపర్–1లో అభ్యర్థుల టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2 సబ్జెక్ట్ పేపర్

పేపర్–2లో ప్రశ్నలు పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు.. అన్ని అంశాలపై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

ఆయా అంశాలను చదివేటప్పుడే అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఎందుకంటే.. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతోంది.

ఆరు శాతం మంది మాత్రమే

మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా (అసిస్టెంట్ ప్రొఫెసర్) ప్రకటిస్తారు. అదేవిధంగా జేఆర్‌ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ అభ్యర్థుల ఎంపికలోనూ కనీస అర్హత మార్కుల ఆధారంగా ఉత్తీర్ణులను ప్రకటించనున్నారు. ఇందుకోసం పలు స్లాట్లలో నిర్వహించనున్న పరీక్షను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపడతారు.

నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్ట్‌లకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం–అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు రూ.67 వేలు బేసిక్ పే చెల్లించాలని యూజీసీ నిర్దేశించింది.
- జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో రెండేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత మరో రెండేళ్లు సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది.
- జేఆర్‌ఎఫ్ హోదాలో మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేల ఫెలోషిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్ఆర్‌ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్, ఎస్ఆర్‌ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారు సైంటిస్ట్‌లుగా కెరీర్ ప్రారంభించొచ్చు.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- ఆర్ట్స్,హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్‌ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 28.10.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 30, 31 అక్టోబర్ 2023
- **పరీక్ష తేదీలు:** 06.12.2023 నుంచి 22.12.2023 వరకు
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in